JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 21-09-2025
Medchal - Malkajgiri | Sunday 21-09-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 116 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 116 | Pages : 8 | ₹: 5







## హెచ్–1బీకి లక్ష డాలర్లా

✍ జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 20:

అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబ్ పేల్చారు.. H1B వీసా ఫీజు ఏకంగా లక్ష డాలర్లకు పెంచేశారు. ఔను.. లక్ష డాలర్లు.. మన కరెన్సీలో దాదాపు 90 లక్షల రూపాయలు కడితేనే H1B ఇస్తారట..! అలాగే.. H1Bపై వచ్చేవారికి ఏటా కనీసం లక్ష డాలర్ల జీతం ఉండాలనే నిబంధన పెట్టారు. టెక్ కంపెనీలకు ఇది పిడుగు లాంటి వార్తే..! ఇంకా క్లారిటీగా చెప్పాలంటే మన భారత్‌కు అమెరికా డోర్స్ క్లోజ్ చేసే ప్రయత్నం చేశారు ట్రంప్.. ఓ పక్క ట్రేడ్ డీల్ రచ్చ కొనసాగుతుండగానే H1Bపై నిర్ణయం తీసుకోవడం పెను సంచలనంగా మారింది. హైలీ స్కిల్డ్ అయితేనే అమెరికాలో చోటు అన్నట్టుగా పాలసీ మార్చి ఇప్పుడు మన టెక్కీలపై దెబ్బకొట్టారు ట్రంప్. భారత్‌తోపాటు చైనాపై ఇప్పుడు ఈ వీసాల ప్రభావం దారుణంగా ఉండబోతోంది. అమెరికన్లను నియమించుకోండి.. అమెరికా ఫస్ట్ అంటూ ఒకటికి పదిసార్లు చెప్తున్న ట్రంప్.. H1B ఫీజు లక్ష డాలర్లకు పెంచడం ద్వారా తన ఉద్దేశం ఏంటో క్లియర్‌గానే బయటపెట్టేశారు. తాజాగా హెచ్-1బీ వీసాలకు ఏటా లక్ష డాలర్ల (సుమారు 84 లక్షల రూపాయలు) అదనపు ఫీజు చెల్లించాలన్న ఉత్తర్వులపై సంతకం చేశారు. ఇప్పుడు ఈ మార్పు ద్వారా కంపెనీలు ప్రతి వీసాకు భారీ ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తుంది. ఈ వీసా కూడా మూడు నుంచి ఆరు

...మిగతాది 2 లో



# పరాధీనతే మన నిజమైన శత్రువు


- ఆత్మనిర్భర్ భారత్‌తోనే ప్రపంచంలో గౌరవం అని స్పష్టం
- విదేశీ షిప్పింగ్‌పై ఏటా రూ.6 లక్షల కోట్ల భారీ వ్యయం
- మన రక్షణ బడ్జెట్‌కు సమానమైన మొత్తమని వెల్లడి
- కాంగ్రెస్ విధానాలతోనే షిప్పింగ్ రంగం కుప్పకూలిందని విమర్శ

✍ జయభేరి, న్యూఢిల్లీ:

భారతదేశానికి అసలైన శత్రువు ఇతర దేశాలపై ఆధారపడటమేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ బలోపేతానికి, ప్రపంచ గౌరవానికి స్వావలంబన ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. హెచ్ 1బీ వీసా ఫీజు పెంపు వేళ, గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో శనివారం జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచంలో మనకు పెద్ద శత్రువులెవరూ లేరు. ఇతర దేశాలపై ఆధారపడటమే మన ఏకైక నిజమైన శత్రువు. ఈ పరాధీనత అనే శత్రువును మనమందరం కలిసి ఓడించాలి" అని మోదీ పిలుపునిచ్చారు. ఇతరులపై ఆధారపడితే మన ఆత్మగౌరవం దెబ్బతింటుందని, 140 కోట్ల మంది ప్రజల భవిష్యత్తును ఇతరుల చేతుల్లో పెట్టలేమని ఆయన అన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం తప్పనిసరిగా ఆత్మనిర్భర్‌గా మారాలని ఆయన అభిప్రాయపడ్డారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో నౌకా నిర్మాణాన్ని ప్రోత్సహించకుండా, విదేశీ నౌకలకు అద్దె చెల్లించడానికే వారు ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. దీనివల్ల దేశంలో షిప్పింగ్ రంగం పూర్తిగా కుప్పకూలిందని, 90 శాతం వాణిజ్యం కోసం విదేశీ నౌకలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా సరుకు రవాణా కోసం విదేశీ షిప్పింగ్ సంస్థలకు భారత్ ఏటా దాదాపు రూ.6 లక్షల కోట్లు చెల్లిస్తోంది. ఈ మొత్తం మన రక్షణ బడ్జెట్‌తో దాదాపు సమానం" అని మోదీ వివరించారు. అమెరికా ఇటీవల హెచ్ 1బీ వీసాలపై భారీగా ఫీజులు విధించడం, భారత దిగుమతులపై సుంకాలు కొనసాగించడం వంటి పరిణామాల నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

...మిగతాది 2 లో

## నేను మళ్లీ చెబుతున్నా.. మనకు ఒక బలహీన ప్రధాని ఉన్నారు



- హెచ్-1బీ వీసా ఫీజు పెంపు...
- అమెరికాలో భారీగా పెరిగిన H-1B వీసా ఫీజులు
- ప్రధాని మోదీ బలహీన ప్రధాని అంటూ రాహుల్ తీవ్ర విమర్శ
- లక్ష డాలర్లకు చేరిన వార్షిక ఫీజుతో భారతీయులపై పెను భారం
- మోదీ-ట్రంప్ స్నేహం వట్టిదేనని ఆరోపించిన కాంగ్రెస్ నేతలు
- అమెరికన్ల ఉద్యోగాల కోసమే ఈ నిర్ణయమన్న ట్రంప్ ప్రభుత్వం

✍ జయభేరి, న్యూఢిల్లీ:

అమెరికా తీసుకున్న హెచ్ 1బీ వీసా ఫీజు పెంపు నిర్ణయం ఇప్పుడు భారత్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ పరిణామంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నేను మళ్లీ చెబుతున్నా... భారత్‌కు ఒక బలహీన ప్రధాని ఉన్నారంటూ ఆయన ఘాటుగా విమర్శించారు.
శనివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్ 1బీ వీసా ఫీజును 1,00,000 డాలర్లకు పెంచడం వల్ల అత్యధికంగా నష్టపోయేది భారతీయులేనని పేర్కొంటున్న ఒక వార్తా కథనాన్ని కూడా ఆయన తన పోస్టుకు జత చేశారు. 2017 జులై 5న కూడా తాను ఇదే విధంగా "భారత్‌కు బలహీన ప్రధాని ఉన్నారు" అని

...మిగతాది 2 లో




## రేవంత్ రెడ్డి భయపడుతున్నారేమో

✍ జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 20:

ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చన్నారు కవిత. రాజకీయాల్లో అవకాశాలు ఎవరూ ఇవ్వరని తొక్కుకుంటూ వెళ్లాలని చెప్పుకొచ్చారు. జాగృతి కార్యాలయంలో ఆల్మట్టి ఎత్తు పెంపుపై మీడియాతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా రాజకీయలపై మాట్లాడారు. ఎంతమంది జై బీసీ అంటే అంత త్వరగా బీసీలకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. పార్టీలో తనకు జరిగిన ఇబ్బందులపై సీఎం ఏమన్నారో తెలియదన్నారు. కానీ పార్టీలో ఇబ్బందులు పెట్టారని తెలంగాణ ప్రజలకు తెలుసని వివరించారు. అయితే తను అంటే రేవంత్ రెడ్డి భయపడుతున్నారేమో అని సందేహం వ్యక్తం చేశారు. తనను కాంగ్రెస్ అగ్రనాయకత్వం సంప్రదించలేదని తనకు ఆ పార్టీలో చేరే ఉద్దేశం కూడా లేదని పేర్కొన్నారు. అసలు ఆ పార్టీ తెలంగాణలో మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదన్నారు. హరీష్ రావు మీడియా, బీఆర్ఎస్ సోషల్ మీడియా, సంతోష్ రావు సీక్రెట్ మీడియా దాడి చేస్తున్నాయని తెలిపారు. గతేడాది రాజకీయ కారణాలతో బతుకమ్మను జరుపుకోలేకపోయామన్నారు. ఇప్పుడు జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలకు హాజరు అవుతున్నట్టు ప్రకటించారు. సొంత ఊరు నుంచి ఆహ్వానం వచ్చింది కాబట్టే చింతమడకకు బతుకమ్మ ఉత్సవాలకు వెళ్తున్నట్టు వెల్లడించారు. చింతమడకకు వెళ్లడాన్ని రాజకీయ కోణంలో చూస్తారని తెలుసని

...మిగతాది 2 లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కష్టాలు



✍ జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 20:

తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలకు సుప్రీం కోర్టు విధించిన గడువు సమీపిస్తోంది. దీంతో స్పీకర్ గడ్డం పసాద్‌కుమార్ వేగంగా ప్రక్రియ చేపడుతున్నారు. తాజా చర్యలు అనూహ్యమైన మలుపును తీసుకొచ్చాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యేలపై డిఫెక్షన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్పీకర్ జారీ చేసిన అదనపు నోటీసులు విచారణ ప్రక్రియను వేగవంతం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చలకు దారితీశాయి. 2024లో బీఆర్ఎస్‌లోని పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో ఫిరాయింపు వివాదం మొదలైంది. ఎమ్మెల్యేలు - పోచారం శ్రీనివాస్ రెడ్డి (బంస్వాడ), కల్యా యాదయ్య (చేవెళ్ల), ఎం. సంజయ్ కుమార్ (జగిత్యాల), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గుడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), టి. ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపుడి గాంధీ (సేరిలింగంపల్లి), దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకట రావు (భద్రాచలం) - బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచినా పార్టీ మారారు. బీఆర్ఎస్ నేతలు ఈ మార్పును

...మిగతాది 2 లో

## పల్నాడులో భయానక పరిస్థితులు



✍ జయభేరి, గుంటూరు, సెప్టెంబర్ 20 :

టీవలి వరకు పల్నాడు జిల్లా మాచర్లలో ఎంతటి భయానక వాతావరణం ఉండేదంటే, తన లాంటి నాయకుడు కూడా ఇక్కడికి రాలేని దుస్థితి ఉండేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఎవరైనా స్వేచ్ఛగా ఈ ప్రాంతానికి వచ్చే పరిస్థితి కల్పించామని ఆయన తెలిపారు. 'స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మాచర్లలో నిర్వహించిన 'ప్రజావేదిక' బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో చెత్తను తొలగించడంతో పాటు, చెత్త రాజకీయాలను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. "పల్నాడులో అరాచకాలు, దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నా. రౌడీయిజం, నేరాలు, ఘోరాలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ప్రజల ఆస్తులకు మేమే రక్షణగా నిలబడతాం" అని ఆయన గట్టిగా హెచ్చరించారు. గతంలో రాయలసీమలో ముఠా సంస్కృతిని అణచివేశామని, ఇక్కడ కూడా అలాంటి పరిస్థితులకు తావివ్వబోమని తేల్చిచెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. రోడ్లపై 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వేయడమే కాకుండా, చెత్తపై పన్ను వేసి ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పన్నును రద్దు చేశామని గుర్తుచేశారు. కేవలం రోడ్లపై చెత్తను తీయడమే కాదని, మనసుల్లోని చెత్తను కూడా తొలగించాలని ఆయన పిలుపునిచ్చారు. మాచర్లలో ఇటీవల వరకు ప్రజాస్వామ్యం లేదని, ఎవరి ప్రవర్తన బాగాలేకపోయినా ప్రజలు క్షమించరని ఆయన వ్యాఖ్యానించారు.

...మిగతాది 2 లో

## మావోయిస్టుల్లో మార్పు సాధ్యమేనా

...మిగతాది 2 లో

## రాజీనామాపై ఈటెల క్లారిటీ

✍ జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 20:

సోషల్ మీడియా అనేది విపరీతం అయిపోయిన తర్వాత వాస్తవం ఏదో.. అవాస్తవం ఏదో తెలియడం లేదు. కాకపోతే ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. చివరికి ఈ ప్రచారం రకరకాల చర్చలకు కారణమవుతోంది. అనేకరకాల పెడపోకడలకు దారితీస్తోంది. చివరికి జరగాల్సిన నష్టం జరుగుతోంది. ఇటువంటి సంఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోయాయి. ముఖ్యంగా రాజకీయ పార్టీల నాయకులు తమకు గిట్టని నాయకుల మీద సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తున్నారు. జనాల్లోకి ఊహగానాలను వ్యాప్తి చేసి అసంతృప్తికరమైన వాతావరణన్ని సృష్టిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈటెల రాజేందర్ కాస్త నిశ్శబ్దంగా ఉన్నారు. ఆ మధ్య కాళేశ్వరం విచారణ.. హైడ్రా కూల్చివేతల మీద తీవ్రస్వరాన్ని వినిపించారు రాజేందర్. అంతకుముందు పార్టీలో ఉన్న ఒక కీలక నాయకుడి మీద తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. చరిత్రలో తొలిసారిగా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నిశ్శబ్దంగా ఉండే రాజేందర్ ఆ సమయంలో మండే అగ్నిగుండం లాగా దర్శనమిచ్చారు. దీంతో దెబ్బకు

...మిగతాది 2 లో





# యువత మత్తుకు.. బానిసలవొద్దు..

- భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్టేట్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ శివనాయక్




**జయభేరి, చర్ల, సెప్టెంబర్ 20 :**

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ యందు చర్ల మండల యూత్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వల్ల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కలిగించడం కోసం సమాజం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం అనే అంశంపై మండలంలోని ఎనిమిది నుంచి పది తరగతుల విద్యార్థిని విద్యార్థులకు మరియు ఇంటర్మీడియట్ విద్యార్థినీ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి శివనాయక్ విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు యువత మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్ ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. చర్ల మండలం ఛత్తీస్ ఘడ్ రాష్ట్రానికి సరిహద్దున ఉన్నందున పిల్లలు డ్రగ్స్ కు అలవాటు పడి వారి జీవితం నాశనం చేసుకుంటున్నారని అన్నారు. పిల్లలు మాదకద్రవ్యాల మత్తుకు చిత్తవుతూ కన్నవారి కలల సౌదాలను కొల్లగొడుతున్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా జీవిత లక్ష్యం వైపు పయనించి బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవడానికి ఈ అవగాహనా సదస్సు ఎంతగానో తోడ్పడుతుందని ఆయన అన్నారు. డ్రగ్స్ కు నో చెప్పండి బంగారు భవిష్యత్తుకు సోపానాలు నిర్మించుకోండి అంటూ యువతకు పిలుపునిచ్చారు.

**మొబైల్ వద్దు... పుస్తకాలు ముద్దు... సిఐ రాజు వర్మ**

యువత నేడు సోషల్ మీడియా కి ఆకర్షితులై నిండు నూరేళ్ల జీవితాన్ని ఆగం చేసుకుంటున్నారని సీఐ రాజు వర్మ అన్నారు. మొబైల్ ను వదిలి పుస్తకాల చేత పట్టి ఈ వయసులో ఏదైతే మంచి నిర్ణయం తీసుకుంటారో అదే మీ జీవితాన్ని నిలబెడుతుందని అన్నారు. విద్యార్థుల జీవితాలను నిర్ణయించేది ఇద్దరు ఒకరు తల్లిదండ్రులు మరొకరు ఉపాధ్యాయులు. తల్లిదండ్రులు కానీ ఉపాధ్యాయులు గాని విద్యార్థుల తప్పులను సరిదిద్ది సన్మార్గంలో పెట్టినట్లయితే ఆ విద్యార్థి జీవితంలో ఒక మంచి పొజిషన్ లో ఉండి ఆ ఉపాధ్యాయుడిని జీవితాంతం గుర్తుపెట్టుకుంటాడు. డబ్బు ఎప్పుడైనా సంపాదించవచ్చు కానీ సమయం మాత్రం పోతే మళ్ళీ సంపాదించుకోలేము. కాబట్టి యువత చెడు వ్యసనాల వైపు మల్లకుండా మంచిగా చదువుకొని ఉన్నతమైన స్థానాలను ఏర్పరచుకొని మీ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు అంబేద్కర్ అవులూరి సత్యనారాయణ సాధన పల్లి సతీష్ భాష్యం శారద దాట్ల సంధ్య యలమందల జగదీష్ చల్లా శివ కృష్ణ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నరేంద్ర డాక్టర్లు దివ్య నాయనా రామకృష్ణ నగేష్ మండల విద్యాశాఖ అధికారి పరిటాల వెంకటరమణ ఎస్సైలు నర్సిరెడ్డి కేశవులు చర్ల మండల యూత్ సభ్యులు నరసింహారెడ్డి పరిటాల సంతోష్ కుమార్. కొట్టే నవీన్ బొబ్బిలిపాటి రవి కిరణ్ కిషోర్ రామలక్ష్మణ్ విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించిన తేగడ ఐశ్వర్య మహిళా శక్తి అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## 22 రోజుల్లో 260 కోట్లు.

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 20:**

ఈ ఏడాది బాక్స్ ఆఫీస్ వద్ద సర్ప్రైజ్ హిట్స్ గా నిల్చినవి చాలానే ఉన్నాయి. కచ్చితంగా సూపర్ హిట్ అవుతుంది అనుకున్న సినిమాలు అట్టర్ ఫ్లాప్ అవ్వగా, అసలు ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన సినిమాలు మాత్రం ఆడియన్స్ మైండ్ బ్లాక్ అయ్యేలా చేశాయి. అలాంటి చిత్రాల్లో ఒకటి 'లోక'. మలయాళం స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్ర పోషించింది. మలయాళంలో మోహన్ లాల్ సినిమాల రికార్డ్స్ ని కూడా బద్దలు కొట్టిన ఈ చిత్రం 22 రోజులు పూర్తి చేసుకోగా బాక్స్ ఆఫీస్ వద్ద 262 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్టు చెప్తున్నారు ట్రేడ్ విశ్లేషకులు. ఇంత వసూళ్లను రాబట్టిన ఈ సినిమా ఎందుకో తెలుగు వెర్షన్ లో ఇంకా ఎక్కువ వసూళ్లను రాబట్టి ఉంటే బాగుండేది అనిపించింది ప్రముఖ నిర్మాత నాగవంశీ ఈ చిత్రం తెలుగు వెర్షన్ రైట్స్ ని కొనుగోలు చేశాడు. కేవలం మూడు కోట్ల రూపాయిల పెట్టుబడి తో ఆయన దాదాపుగా నాలుగు కోట్ల 30 లక్షల రూపాయలకు పైగా లాభాలను సొంతం చేసుకున్నాడు. ట్రేడ్ పండితుల అంచనా ప్రకారం ఈ సినిమాకు 15 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లు రాగా, 7 కోట్ల 80 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. ఇంకా ఎక్కువ వసూళ్లు రావొచ్చు, కానీ ఎందుకో అనుకున్న టార్గెట్ ని చేరుకోలేదు అనిపించింది. తెలుగు లో బిజినెస్ ప్రకారం చూస్తే డబుల్ బ్లాక్ బస్టర్ కానీ, కనీసం 30 కోట్ల షేర్ వచ్చి ఉండుంటే బాగుండేది అని విశ్లేషకుల అభిప్రాయం. ఇక మిగిలిన భాషల్లో వచ్చిన వసూళ్లను ఒకసారి పరిశీలిస్తే కేరళ నుండి 96 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టిన ఈ సినిమా, తమిళ నాడు నుండి 18 కోట్లు, కర్ణాటక నుండి 13 కోట్లు,రెస్ట్ ఆఫ్ ఇండియా నుండి 7 కోట్ల 30 లక్షలు, ఓవర్సీస్ నుండి 112 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. ఓవరాల్ గా ప్రపంచవ్యాప్తంగా 262 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు, 115 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి.

## రైలు ఢీకొని ఇద్దరు మృతి ఒకరికి గాయాలు

**జయభేరి, సికింద్రాబాద్:**

బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో ముగ్గురు యువకులను రైలు ఢీకొట్టింది.బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ వద్ద తెల్లవారుజామున ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడిక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలు అయ్యాయి.మృతులు కార్థానా, మచ్చ బొల్లారం వాసులుగా పోలీసులు గుర్తించారు. ఈ ముగ్గురు స్నేహితులేనని ఉదయాన్నే రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. యువకుల మృతితో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి..

# సార్ కు సర్ ప్రైజ్

- పూలు చల్లి శాలువాకప్పి, చాక్లెట్లు తినిపించి..
- రైతుల ఆశాజ్యోతి పులి రాజుకు విద్యార్థుల సత్కారం

**జయభేరి, వర్గల్, సెప్టెంబర్ 20 :**



బడిలో పిల్లలు పాఠాలతో పాటు భవిష్యత్తు పాఠాలు నేర్చుకుంటున్నారు. చదువుతో పాటు సంస్కరానికి శ్రీకారం చుట్టారు. సార్ ను సర్ ప్రైజ్ చేసి శభాష్ అనిపించుకున్నారు. వర్గల్ మండలం తునికి ఖాల్సా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పులి రాజు రాష్ట్రవ్యాప్తంగా గత 25 సంవత్సరాలుగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు అండగా నిలుస్తున్నాడు. రాష్ట్రంలో ఎక్కడ రైతు ఆత్మహత్య జరిగిన ఆ ప్రాంతానికి వెళ్లి ఆ కుటుంబం యొక్క స్థితిగతులు ఆత్మహత్యకు గల కారణాలు వంటి వివరాలు అడిగి తెలుసుకుని ఆ కుటుంబానికి దాతల సహకారంతో సహాయం అందిస్తున్నాడు. ముఖ్యంగా ఆ రైతు కుటుంబంలో ఎవరైనా చదువుకునే పిల్లలు ఉంటే వారికి ఉన్నత విద్య చదువుకోవడానికి తోడ్పాటు అందిస్తున్నాడు. సార్ సేవలను పిల్లల తల్లిదండ్రుల వాట్సప్ స్టేటస్ లలో, వార్త పత్రికలలో గమనించిన విద్యార్థులు సార్ ను సన్మానించాలనుకున్నారు. పిల్లలంతా వారి, వారి ఇండ్ల వద్ద నుండి పూలను తీసుకువచ్చారు. అన్ని ఒక కవర్లో పోసుకున్నారు. రోజులాగే పాఠశాలకు వచ్చి ప్రేయర్ పూర్తికాగానే ఉపాధ్యాయుడు పులి రాజు అటెండెన్స్ రిజిస్టర్ పట్టుకుని నాలుగవ తరగతి గదిలోకి రాగానే పూలు చల్లి స్వాగతం పలికారు. అనంతరం పిల్లలందరూ సార్ చేతులు పట్టుకొని కుర్చీలో కూర్చోబెట్టి శాలువా కప్పి పెద్ద మనస్సు చాటుకున్నారు. అప్పటికి ఉపాధ్యాయుడు పులి రాజుకు ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. పిల్లలు ఏం చేస్తున్నారో తెలియడం లేదు. నేను బదిలీ అయి వెళ్లడం లేదు, రిటైర్మెంట్ కాలేదు, నా బర్త్ డే కూడా కాదు ఎందుకు నన్ను సన్మానిస్తున్నారు బిడ్డ! అని ప్రశ్నించిన సార్ కు ఆ విద్యార్థులు ఆశ్చర్యపోయే సమాధానం ఇచ్చారు. మీరు రైతులకు చేస్తున్న సేవలు చూసి మాకు చాలా బాధ అనిపించింది మీరు చేస్తున్న ఆ సేవ మమ్మల్ని ఆకర్షించాయి. సార్ మేము రైతు కుటుంబాల నుండి వచ్చాము మా తల్లిదండ్రులు వ్యవసాయమే చేస్తారు. అటువంటి రైతుల్ని పట్టించుకున్న మిమ్మల్ని సన్మానించుకోవాలనుకున్నము సార్ అని చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసింది. బాగా చదువుకుని భవిష్యత్తులో రైతు కుటుంబాలకు అండగా నిలుస్తామని విద్యార్థులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వర్షిత్ కుమార్ అనే విద్యార్థి మాట్లాడుతూ నేను డాక్టర్ నై రైతులకు ఉచితంగా సేవ చేస్తాను. వంక దత్త శ్రీ పాద్ అనే విద్యార్థి మాట్లాడుతూ నేను కలెక్టర్ నై రైతులందరికీ ఉచితంగా ఇల్లు కట్టిస్తాను. ప్రవల్లిక అనే విద్యార్థి మాట్లాడుతూ నేను కూడా టీచర్ అయి రైతు కుటుంబాల పిల్లలకు ఉచితంగా విద్యను అందిస్తానని పిల్లలు చెప్పడం మా సార్ భావోద్వేగానికి గురి కావడమే కాకుండా మరింత బాధ్యత పెరిగినట్లు ఆ సార్ అన్నాడు.

# పరకాల బిట్స్ లో బతుకమ్మ సంబరాలు

- బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న చైర్మన్ రాజేంద్రప్రసాద్ రెడ్డి
- విద్యార్థులో ఆడి పాడిన ఉపాధ్యాయులు

**జయభేరి, పరకాల, సెప్టెంబర్ 20:**



పరకాల పట్టణంలోని బిట్స్ పాఠశాలలోని ప్రిన్సిపల్ యుగేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో పేర్చినటువంటి బతుకమ్మలను తీసుకొచ్చారు. తొమ్మిది రోజులకు అనుగుణంగా 9 మంది అమ్మవార్లను తయారు చేశారు. పిల్లలందరూ బతుకమ్మల చుట్టు తిరుగుతూ పాటలు పాడుతూ కోలలతో నృత్యాలు చేసారు. ఈ నృత్యాలు చూపర్లను ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల చైర్మన్ రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే పండుగ బతుకమ్మ. ఇది పూల జాతర అని సెప్టెంబర్ నెలలో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని తొమ్మిది రోజుల వరకు రోజుకోక తీరున రోజుకొక పేరుతో కొలిచే బతుకమ్మను పూలతో పేరుస్తూ ఆడపడుచులందరూ ఆనందంగా జరుపుకునే పండుగ అని అన్నారు. ఇది తెలంగాణకు మాత్రమే సంబంధించిన పండుగ అని బతుకమ్మ ప్రకృతితో ముడిపడిన పండుగనీ పువ్వులనే దేవుడిగా కొలవడం తమ బతుకులను, కష్టాలను పాటలుగా పాడుకోవడం ఒక తెలంగాణ ప్రజలకు మాత్రమే చెల్లింది అని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మకు తెలంగాణలో ఎక్కడ గుడి కనిపించదని, బతుకమ్మ పేర్చటంలో వాడే ఆకులు, పూలు మంచి ఔషధలు అని వీటిని చెరువులో కలపడం వల్ల నీటి శుద్ధి జరుగుతుంది అందుకే బతుకమ్మ పండుగ ప్రకృతి పండుగ అయిందని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ యుగేందర్ మాట్లాడుతూ తెలంగాణ పడుచు బోనమెత్తితే దుర్గమ్మ పరవశిస్తుందనీ తెలంగాణ పడుచు బతుకమ్మ ఆడితే ప్రకృతి పులకరిస్తుందని హిందూ ముస్లింల ఆలై బలైలు తెలంగాణతో మమేకం మనకంటూ ప్రత్యేక విశిష్టత ఉంది మనకంటు ప్రత్యేక సంస్కృతి ఉంది అని ఈ పండుగ వైభవం ఎంతో గొప్పదని అలాగే దసరా పండుగ రోజు జరిపే రావణాసురుని వధ ప్రత్యేకతను తెలియజేసి చెడుపై మంచి విజయం సాధించిన తీరును తెలియజేశారు. అనంతరం రావణాసురుని వద కార్యక్రమంలో అందరు పాల్గొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపల్ యుగేందర్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## యువత వ్యాపారంలో రాణించాలి

- తిరుమల డిజిటల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 20 :**

యువత వ్యాపారంలో రాణించాలి. నిరంతర కృషితో సమాజంలోని మార్పులను గమనిస్తూ పరుగెత్తుతున్న ప్రపంచంలో యువత మెరుగైన నైపుణ్యతతో ముందుకు సాగాలి. షాద్ నగర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన తిరుమల డిజిటల్ ను ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ; యువత స్వయం ఉపాధితో ముందుకు సాగుతూ నైపుణ్యతను పెంపొందించుకొని వ్యాపార రంగంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే నూతన ప్రమాణాలను, పద్ధతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అప్పుడే ఆర్థిక అభివృద్ధి సాధ్యపడుతుందని తిరుమల డిజిటల్ యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ మాధురి నందకిషోర్, ఈశ్వర్ రాజు,జూపల్లి కౌశల్య శంకర్,పిల్లి శారద శేఖర్,బీఆర్ఎస్ నాయకులు రఘునాథ్ యాదవ్,పాపి రెడ్డి గూడ మాజీ ఎంపిటిసి రాంచందర్,బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## ప్రజాస్వామ్యంలో న్యాయవాదుల పాత్ర కీలకమైనది

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సబియా సుల్తానా, చంద్రశేఖర్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 20 :**

ప్రజాస్వామ్యంలో న్యాయవాదుల పాత్ర కీలకమైంది. వందమంది దోషులు తప్పించుకున్న పర్వాలేదు కానీ! ఒక్క నిర్దోషికి కూడా శిక్షకు గురి కావొద్దు. న్యాయస్థానంలో బాధితుల పక్షాన నిలబడి వారికి న్యాయం పొందే విధంగా కృషి చేయాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. శనివారం షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాపు కార్యాలయంలో ఫోక్సొ కొట్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా, 16వ అదనపు సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ రెడ్డి తదితర స్థానిక సీనియర్ న్యాయవాదులు ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం ఇచ్చి వారిని శాలువాలతో ఎమ్మెల్యే శంకర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ మాట్లాడుతూ.. న్యాయ వృత్తిలో నిరంతరం ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ పేద ప్రజలకు, బాధితులకు అండగా ఉంటూ బాధితులని రక్షించాలని అన్నారు. ఎంతటి వారినైనా శిక్షించే అధికారం న్యాయస్థానానికి ఉన్నదని అలాంటి న్యాయ వ్యవస్థలో పనిచేసే న్యాయవాదులు బాధితుల పక్షాన నిలబడి వారికి అన్యాయం జరగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్ సెట్ లో ఐడియా ల్యాబ్ ప్రారంభం



**జయభేరి, మేడ్చల్:**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్ సెట్ కళాశాలలో ఏఐసీటీఈ ఆద్వర్యంలో ఐడియా ల్యాబ్ ను కళాశాల ప్రిన్సిపాల్ వాక మురళి మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సజనాత్మకత, ఆవిష్కరణ దక్పథం, డిజైన్ థింకింగ్, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించేందుకు ల్యాబ్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్ఈపీ-2020 లక్ష్యాలకు అనుగుణంగా ఉన్న ఈ ల్యాబ్ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐడియా ల్యాబ్ కోఆర్డినేటర్ మల్లికార్జున లింగం, సహాయక కోఆర్డినేటర్ గోపాలకష్ణ,ల్యాబ్ టెక్ గురూస్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన యూనివర్సిటీ విద్యార్థులు



**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 20:**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పరిధిలో గల అరుణ్ తేజ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మల్లారెడ్డి యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు శనివారం సందర్శించారు. ఒక్క ఆవుతో 30 ఎకరాల శ్రీ సుభాష్ పాలేకర్ విధానంలో గత ఐదు సంవత్సరాలుగా యువ రైతులు వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ఎద్దుగానుగా నూనె తయారీ విధానాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. జీవామృతము, ఘన జీవామృతము, దశ ప్రాత్ర కషాయము, బీజామృతము, పల్లి నూనె, కొబ్బరి నూనె ,నువ్వుల నూనె ,వెర్రి నూనెలు ఆముదము నూనెల తయారీ విధానాన్ని గురించి స్వయంగా చూసి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ తేజ ప్రకృతి వ్యవసాయ క్షేత్ర యజమానులు డేగల సుధాకర్, డేగల రవీందర్ ,మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు ఎం విక్రమ్, సాయి, జి ఆదిలక్ష్మి, ఎం తేజ, ఎన్ కీర్తి ,వెంకటే, కళ్యాణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పాల్గొన్నారు.

# రైతులను నిండా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

■ చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

**జయభేరి, పరకాల, సెప్టెంబర్ 20:**



బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి అన్నంపెట్టే రైతన్నలను నిండా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులు ఛీ కొడుతున్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం నడికూడ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన రైతు కళ్యాణపు రాజమొగిలి(రవి) యూరియా కోసం వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనగా తీవ్రగాయాలపాలై హనుమకొండలోని ప్రయివేటు హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఆయనను పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా రవి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదని విమర్శించారు. పులిగిల్ల గ్రామానికి చెందిన రైతులకు వరికోలు గ్రామంలో టోకెన్లు ఇవ్వడమేంటి అక్కడ టోకెన్ తీసుకొని పరకాలలో సొసైటీలో యూరియా ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఎలాగైనా పంటలను దక్కించుకోవాలనే ఆరాటంతో యూరియా కోసం బయలుదేరిన రైతులను రోడ్డు ప్రమాదాలపాలై ప్రాణాలు కోల్పోతున్న మొద్దు నిద్రలో ఈ ప్రభుత్వం ఉన్నదని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ పాలనలో ఇలాంటి సంఘటలకు తావులేదన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచిన ఘనత కేసిఆర్ గారిదన్నారు. రైతులెవరూ అధైర్య పడొద్దని, ధైర్యంగా నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడి యూరియా తెచ్చుకుందామని అన్నారు. మీకు అండగా బిఆర్ఎస్ ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. రైతులను గోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి ఉసురు తగులుతుందని అన్నారు. పరకాల ఆర్టీసీ డీఎం, అగ్రికల్చర్ అధికారులతో ఫోన్లో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే ప్రమాదంలో కాలువిరిగిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తీరొక్క పూలతో బతుకమ్మ

**జయభేరి, మూసాపేట్ :**

మూసాపేట్ పంచశీల పాఠశాలలో బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్. మూసాపేట్ పంచశీల పాఠశాలలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలకు మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు స్వయంగా తీరొక్క పూలతో చేసిన బతుకమ్మలు ఆకుట్టుకున్నాయని, పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ద్వారా చదువుకునే పిల్లలకు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన పెరిగిందని, ఇలాంటి వేడుకల ద్వారా పిల్లలు మన సంస్కృతికి మరింత దగ్గర అవుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పంచశీల పాఠశాలల అధినేత శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అనిత, మహిళా టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 'నారాయణ'లో బతుకమ్మ వేడుకలు




**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ నారాయణ స్కూల్లో శనివారం నాడు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్జీ జోన్ ఏజీఎం జీ బాలపరమేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సాల్ సత్యవాణి మాట్లాడుతూ బతుకమ్మ వేడుకల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు రకరకాల రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి అలరించారు. సాంప్రదాయ బతుకమ్మ పాటలను పాడారు. దీనితోపాటు గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి గ్రాండ్ పేరంట్స్ పాల్గొన్నారు.

## డా. ఎ.ఎస్. రావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ECIL) వ్యవస్థాపకుడు డాక్టర్ ఎ.ఎస్. రావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. డాక్టర్ ఎ.ఎస్. రావు 111 పుట్టిన రోజు సందర్భంగా EC Nagar కమ్యూనిటీ హాల్ వద్ద అలాగే సాయి సుధీర్ కాలేజ్ లో నిర్వహించిన రక్తదాన శిబిరం AS Rao విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తర్వాత హోమి జై బాబా కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. AS Rao Nagar కు ఆయన చేసిన సేవలు మరువలేనివి అని ఆయన బాటలో అందరూ ముందుకు సాగాలని ఆయన జయంతి నీ ఘనంగా నిర్వహించిన నిర్వహకులు అభినందనీయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సొసైటీ సభ్యులు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



**జయభేరి, చందంపేట :**

చందంపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలారాణి మాట్లాడుతూ బతుకమ్మ మన సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతీక అని ప్రకృతిని పూజించే తత్వము ఈ పండుగలో ఉందని రేపటి పౌరులుగా మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని వివరించారు. తదనంతరము విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో అలరించారు ఈ కార్యక్రమములో ఎం చంద్రశేఖర్, గోవిందు కొండయ్య, జోసెఫ్ చౌదరి, రామచంద్రు, విజయ, లింగంపల్లి మధు, సంధ్యారాణి, వెంకట్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భువనేశ్వరిని కలిసిన పులివెందుల జడ్పీటీపీ లతా రెడ్డి

**జయభేరి, అమరావతి:**

పులివెందుల జడ్పీటీసీగా తాజా ఎన్నికల్లో విజయాన్ని సాధించిన మారెడ్డి లతా రెడ్డి, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ, "పులివెందుల ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి, ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేయండి. అభివృద్ధి ద్వారా అందరి నమ్మకాన్ని మరింత బలపరచండి. ఈ గెలుపు మీకే కాకుండా పులివెందుల ప్రజలకూ గర్వకారణం అయ్యింది." అని అభినందనలు తెలిపారు. పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి మాట్లాడుతూ పులివెందుల ప్రజల ఆశీస్సులతోనే ఈ విజయాన్ని సాధించగలిగాను. నారా భువనేశ్వరి అందించిన ప్రోత్సాహం, ఆశీర్వాదాలు నాకు మరింత బాధ్యతను కల్పించాయి. ప్రజల సమస్యల పరిష్కారమే నా లక్ష్యం. అభివృద్ధి సాధనకై నిరంతరం కృషి చేస్తాను." అన్నారు.

# ఎడతెరిపిలేని వర్షాలతో కాలనీలు ముంపుకు గురికాకుండా చర్యలు

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.

**జయభేరి, కాప్రా :**



వరుసగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో కాలనీలు వరద ముంపుకు గురికాకుండా ఉండేందుకుగాను అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ పోచమ్మ గుడి మెయిన్ రోడ్డుపై శనివారం వరద నీటి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్లైన్ల మరమ్మతు పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీఐఎల్ టి ఐ ఎఫ్ ఆర్ గ్రౌండ్ నుంచి గత నాలుగు రోజులుగా వస్తున్న భారీ వరద నీళ్లు సాయి నగర్ కృష్ణారెడ్డి బంజారా కాలనీ నాగార్జున నగర్ ఫేస్ 1 శివ సాయి నగర్ మీనాక్షి నగర్ లక్ష్మీ నరసింహ కాలనీ తదితర కాలనీలను ముంచెత్తి స్థానిక కుటుంబాలు ఇబ్బందులు పడిన విషయమై ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ చౌరస్తా నుంచి కుషాయిగూడ మీదుగా అదే విధంగా ఈసీఐఎల్ టీ ఐ ఎఫ్ ఆర్ గ్రౌండ్ లో నుంచి వస్తున్న వరద నీళ్లు సాయి నగర్ మీదుగా పోచమ్మ గుడి వద్ద ప్రధాన రహదారి మలుపు వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైను మరమ్మతులకు గురి కావడం మూలంగా వరద నీళ్లు వెనక్కి తన్నుతూ కాలనీలను ముంచేత్తుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. పోచమ్మ గుడి వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి వరద సాఫీగా కాప్రా నాగారం చెరువుల మధ్య నాలా లోకివెళ్లేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సాయి నగర్ అధ్యక్ష, కార్యదర్శులు సార. వినోద్ కుమార్, సింగిరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోశాధికారి భళ్ళమూడి రవి ప్రసాద్, ఆలయం అధ్యక్షుడు గోపాల కృష్ణ రాజు, చాడ నర్సింహారెడ్డి, శ్రీ కాంత్ రెడ్డి, వెంకటేష్, బలేశ్ స్థానిక నాయకులు సార అనిల్ కుమార్, గంపా కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, జై కృష్ణ, శేఖర్, బాలాజీ, ప్రసాద్, రెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నారు.





## నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

■ ఎంపీ. డీకే అరుణమ్మ, ఈటెల రాజేందర్ ను కలిసి ఆహ్వానించిన బిజెపి రాష్ట కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, బిజెపి నాయకులు ఎంకనోళ్ల వెంకటేష్" బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 20 :**


దేవి నవరాత్రి ఉత్సవాలకు డీకే అరుణమ్మకు ఆహ్వానం. భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో దేవి నవరాత్రి ఉత్సవాలు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలికట్ట శ్రీ అంబా భవాని మాతా దేవాలయంలో నిర్వహిస్తున్న వేడుకలకు ఆలయ చైర్మన్ , పాలకవర్గం తో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, ఎంకనోళ్ల వెంకటేష్, కలిసి ఎంపీలు డీకే అరుణమ్మ, ఈటెల రాజేందర్ లకు ఆహ్వాన పత్రికలు అందజేసి వారిని నవరాత్రి ఉత్సవాలలో తప్పకుండా పాల్గొనవలసిందిగా కోరారు. ఉత్సవాలలో హాజరు కావడానికి ఎంపీ అరుణమ్మ సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు.

# తహాశీల్దార్ కి వినపత్రం అందించిన ఏసీఈ చర్ల డయాసిస్ కమిటీ

**జయభేరి, చర్ల, సెప్టెంబర్ 20 :**

మా సాంస్కృతిక, సామాజిక సమావేశాలకు సమగ్రమైన వివాహాలు, సమాజ విధులు, సమావేశాలను నిర్వహించడానికి సమాధుల కోసం భూమి.. కమ్యూనిటీ హాల్ ఈ రెండు సౌకర్యం అవసరమని మండల తహాశీల్దార్ శ్రీనివాసరావుకి శనివారం ఏసీఈ చర్ల డయాసిస్ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చర్ల డయాలసిస్ బిషప్ జవాజి దిలీప్ కుమార్ మాట్లాడుతూ నియమించబడిన స్థలం లేకపోవడం వారి సంప్రదాయాలు, అభ్యాసాలకు ఆటంకం కలిగిస్తూ, సమాజంగా కలిసి వచ్చే వారి సామర్థ్యాన్ని తీవ్రంగా పరిమితం చేస్తుందని, మాకు నియమించబడిన సమాధి, కమ్యూనిటీ హాల్‌ను అందించడంలో మేము మీ మద్దతును వినయంగా అభ్యర్థిస్తున్నామని తహాశీల్దార్ కి తెలిపారు. ఈ విషయంలో తహాశీల్దార్ జోక్యం ఎంతో ప్రశంసించ బడుతుందని మా కమ్యూనిటీ యొక్క శ్రేయస్సును గణనీయంగా పెంచుతుందని, మా అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నామన్నారు. సానుకూల స్పందన కోసం మేము ఆశాజనకంగా ఉన్నామని తహాశీల్దార్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఈ చర్ల డయాసిస్ బిషప్ జవాజి దిలీప్ కుమార్, అధ్యక్షులు గనిపి పాలరాజు, ఉపాధ్యక్షులు కే బాబురావు, కార్యదర్శి అందుగుల ప్రసాద్, సహాయ కార్యదర్శి ఇర్ప రాజేష్, సభ్యులు పల్లవి రవి కుమార్, బనారి అమోస్, శ్రీఎం తిరుపతి రావు, సీనియర్ పాస్టర్స్ ఎలిపి యేసుజీవం, పీ సొల్మానరాజు, జి చిరంజీవిలు పాల్గొనినారు.

## కత్తితో భార్యను నరికి భర్త పరార్



**జయభేరి, మేడ్చల్:**

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహేశ్ నగర్ కాలనిలో అర్ధరాత్రి కత్తితో భార్యను నరికి భర్త పారిపోయిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే .... బోడ శంకర్(40),భార్య పేరు మంజుల(35) వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఒక పాప ఇద్దరు బాబులు. వీరి స్వస్థలం మోత్కూర్ దగ్గర అడ్డగూడూర్ గ్రామం. నాలుగు రోజుల క్రితం మహేశ్ నగర్ కాలనిలో ఉంటున్న అక్క బావ ఇంటికి కుటుంబంతో వచ్చిన శంకర్ అర్ధరాత్రి అందరు పడుకున్న సమయంలో కత్తితో విచక్షణారహితంగా భార్యను నరకడంతో ఆమె అరుపుల శబ్దానికి అందరు లేవడంతో శంకర్ అక్కడి నుండి పారిపోయాడు. ఆమె అక్కడికి అక్కడే మృతి చెందింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు కుషాయిగూడ పోలీసులు.

# బ్లాక్ ను వైట్ గా మనీ

■ లిక్కర్ కేసులో విస్తుపోయే నిజాలు

**జయభేరి, విజయవాడ, సెప్టెంబర్ 20:**

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. స్కామ్‌లో బ్లాక్ మనీని వైట్‌గా మార్చడం, విదేశాలకు తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడి నుంచి వివిధ సూట్‌కేసు కంపనీల్లో పెట్టుబడులు పెట్టారనే అనుమానాలు ఉన్నాయి. వాటిని నిగ్గుతేల్చే పనిలో పడింది ఈడీ. అందుకే ఈ ఉదయం నుంచి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ స్కామ్‌లో ప్రమేయం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న మనీలాండరింగ్ మధ్యవర్తులపై ఫోకస్ పెట్టింది. అందుకే గురువారం ఉదయం నుంచి హైదరాబాద్, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటకతో సహా దేశవ్యాప్తంగా ఉన్న అనుమానితుల ఇళ్లు ఆఫీసులపై సోదాలు నిర్వహించింది. ఇరవైకి పైగా ప్రాంతాల్లో ఏక కాలంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే దాదాపు 8 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. ముందు ఈ స్కామ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఆ సిట్ చేసిన దర్యాప్తు, నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ జోక్యం చేసుకుంది. ఇందులో మనీలాండరింగ్ ఆరోపణలు ఉండి, భారీగా నిధులు దారి మళ్లించారనే అనుమానాలు వ్యక్తం చేయడంలో కేస్‌ను టేకప్ చేసింది. బినామీ సంస్థలు, షెల్ కంపెనీలు హవాలా ప్రక్రియ ద్వారా దాదాపు ₹3,500 కోట్లు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఇందులో కీలక పాత్ర ఉన్న వారిపై ఈడీ దృష్టి పెట్టింది. వారే లక్ష్యంగా సోదాలు చేస్తోంది. ఈ స్కామ్‌తో సంబంధం ఉన్న డిస్టిలరీల నుంచి కూడా ఇప్పటికే ED వాంగ్మూలాలు తీసుకుంది. జైలులో ఉన్న ప్రధాన నిందితుడు రాజ్ కాసిరెడ్డి వాంగ్మూలం కూడా రికార్డు చేసింది. వాటి ఆధారంగానే ప్రస్తుతం ఈ సోదాలు జరుగుతున్నట్టు సమాచారం. 20192024 మధ్య ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి సరఫరా ఆర్డర్‌లను పొందడానికి 16 మద్యం కంపెనీలు 1,677 కోట్ల రూపాయల లంచం ఇచ్చాయని ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ కేసు నమోదు చేసింది. దీనికి బదులుగా ఆయా కంపెనీలు 10,835 కోట్ల విలువైన కాంట్రాక్టులు పొందినట్లు పేర్కొంది. జగన్ ప్రభుత్వ హయాంలో APSBCL 23 వేల కోట్ల రూపాయల విలువైన సరఫరా ఆర్డర్‌లను జారీ చేసిందని, వాటిలో 90% కంటే ఎక్కువ 111 రిజిస్టర్డ్ మద్యం కంపెనీలలో కేవలం 40 కంపెనీలకు మాత్రమే వెళ్ళాయని SIT తెలిపింది.3,500 కోట్లకుపైగా లంచాలు బినామీ సంస్థలు, షెల్ కంపెనీలు, హవాలా ఆపరేటర్ల ద్వారా మళ్లించినట్టు అనుమానిస్తోంది. సిట్ దర్యాప్తులో వెలుగు చూసిన అంశాల ఆధారంగానే ED మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని ప్రయోగించింది. నిందితులకు, ఆయా సంస్థలు సమన్లు జారీ చేసింది. ఇప్పుడు సోదాలు చేస్తోంది.

# ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో నుంచి ఎందుకు వెళ్లిపోతోంది?

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 20:**



హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలంగా మెట్రో రైల్ ను ఎల్ అండ్ టీ సంస్థ నిర్వహిస్తోంది.. సేవల విషయంలోనూ సమర్ధవంతంగా వ్యవహరిస్తోంది. అయితే అటువంటి సంస్థ మెట్రో రైలు ప్రాజెక్టు నుంచి తప్పుకుంటామని వ్యాఖ్యానించడం సంచలనం కలిగిస్తోంది. దీనికి తోడు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి కీలక నాయకుడు కేటీఆర్ ముడుపుల వల్లే ఎల్ అండ్ టీ మెట్రో నుంచి వెళ్ళిపోతోందని ఆరోపించారు. దీంతో ఎల్ అండ్ టీ వ్యవహారం రాజకీయంగా సంచలనంగా మారింది..మెట్రో ప్రాజెక్ట్ నుంచి పదేపదే వెళ్ళిపోతామని ఎల్ అండ్ టీ చెబుతుండడం పట్ల రేవంత్ ప్రభుత్వం కూడా సీరియస్ గానే దృష్టి సారించినట్టు తెలుస్తోంది.. పదేపదే వెళ్ళిపోతామని చెబితే.. దానికి తాము సరే అంటామని ప్రభుత్వం చెప్పినట్టు తెలుస్తోంది. మెట్రో రెండో దశ ప్రాజెక్టు ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి.. నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఈ పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి దశ కూడా తామే నిర్వహిస్తామని ప్రభుత్వం ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది.. అప్పులు, వడ్డీలు అధికంగా ఉన్నాయని ఎల్ అండ్ టీ చెబుతుండగా.. ఇచ్చిన ఆస్తులు నిర్వహణ సరిగా లేదని ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. అంతర్గతంగాను మెట్రో రైలు నిర్వహణ తనకు ఏమాత్రం ఉపయుక్తంగా లేదని ఎల్ అండ్ టీ అంతర్గతంగా వ్యాఖ్యానించింది. లేఖలు కూడా రాసింది.. మరోవైపు రెండోదశ నిర్మాణానికి సంబంధించి మొదటి విడతలో 24,259 కోట్లు, రెండవ విడుదల 19,450 కోట్లతో ప్రభుత్వమే విస్తరణ చేపడుతుందని ఇటీవల ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.హైదరాబాదులో మెట్రో డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలను మెట్రో రైలుతో అనుసంధానించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఇంతటి భారీ విస్తరణకు ప్రణాళికలు చేపట్టిన ప్రభుత్వం.. మొదటి విడత నిర్వహణను చేతుల్లోకి తీసుకోవడానికి ఇబ్బంది ఉండదని భావిస్తోంది. అయితే ప్రభుత్వం తానంతట తానుగా ఆ ప్రతిపాదన పెట్టదని.. ఒకవేళ ఎల్ అండ్ టీ ఓకే అంటే మాత్రం వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని సర్కార్ ఉన్నట్టు తెలుస్తోంది. మనదేశంలో చాలా రాష్ట్రాలలో ప్రభుత్వాలే మెట్రో రైలు వ్యవస్థను నిర్వహిస్తున్నాయి. తెలంగాణలో కూడా అదే విధంగా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అవసరమైతే దీనికోసం ఒక ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వ మదిలో ఉంది. నిధుల సమీకరణ కూడా దీనికోసం పనికి వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పటికే ఎల్ అండ్ టీ కి కేటాయించిన ఆస్తుల విషయంలో నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. ఆస్తుల నిర్వహణ కూడా ప్రభుత్వం చేతికి వస్తే ఆర్థికంగా భారం కూడా ఉండదని తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో మెట్రో నిర్వహణ ఆర్థిక భారం అవుతుందని. ప్రాజెక్టు కోసం భారీగా పెట్టుబడులు పెట్టినప్పటికీ, ఆర్థిక లాభాలు అనుకున్న స్థాయిలో లభించడం లేదని కంపెనీ ఆందోళన వ్యక్తం చేసింది. అందుకే నిర్వహణ బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వీకరించాలనీ, ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ ను ఏర్పాటు చేయాలని కోరింది. ఎందుకు భారం అవుతోంది? హైదరాబాద్ మెట్రోను నిర్మించడానికి L&T సుమారు 20,000 కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడి పెట్టింది.

ప్రాజెక్టు ప్రారంభ దశలో మంచి ఆదాయం వస్తుందని కంపెనీ అంచనా వేసింది. కానీ వాస్తవంలో కొన్ని ప్రధాన సమస్యలు తలెత్తాయి. కోవిడ్ ప్రభావం - మహమ్మారి సమయంలో ప్రయాణికుల సంఖ్య తీవ్రంగా పడిపోయింది. ఇంకా పూర్తిగా రికవరీ కాలేదు. ఆపరేషనల్ ఖర్చులు ఎక్కువ - మెట్రో నడపడం, సిబ్బందికి వేతనాలు, విద్యుత్ ఖర్చులు, నిర్వహణా వ్యయాలు అన్నీ భారీగా పెరుగుతున్నాయి. అంచనాలకు తగ్గ ప్రయాణికులు - రోజుకు 10-12 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా. కానీ ఇప్పటికీ 5-6 లక్షల మందికి మించి ప్రయాణికులు లేరు. రుణ భారం - ప్రాజెక్టు కోసం తీసుకున్న అప్పులు, వాటిపై వడ్డీలు కంపెనీకి భారమవుతున్నాయి. ఈ కారణాల వల్లకి నిర్వహణలో ఆర్థిక ఒత్తిడి పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర. ప్రస్తుతం మెట్రో ప్రాజెక్టు పూర్తిగా పబ్లిక్ప్రైవేట్ పార్ట్నర్షిప్ మోడల్లో నడుస్తోంది.

ఇందులో ప్రభుత్వాలు భూసేకరణ, అనుమతులు, పాలసీ మద్దతు వంటి సహకారం అందించాయి. కానీ ఆర్థికపరంగా మొత్తం బాధ్యతదే. ఇప్పుడు పరిస్థితులు మారడంతో, కోరుతుంది. నిర్వహణను ప్రభుత్వాలు స్వీకరించాలి. ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసి దానిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే భాగస్వాములుగా ఉండాలి. దీని ద్వారా ప్రాజెక్టు కొనసాగింపు, అభివృద్ధి సజావుగా సాగుతుంది. ఒక ప్రత్యేక వాహకం ఏర్పాటు చేస్తే అనేక లాభాలు ఉంటాయి. ఆర్థిక స్థిరత్వం - ప్రభుత్వాల మద్దతుతో నిధులు సమకూరుతాయి. పబ్లిక్ ఇంటరెస్ట్ ప్రాధాన్యం - లాభాల కంటే ప్రజా సేవలకు ప్రాముఖ్యత ఉంటుంది. విస్తరణ సులభతరం - భవిష్యత్లో కొత్త కారిడార్లు, లింకులు సులభంగా నిర్మించవచ్చు. ప్రజల నమ్మకం పెరుగుతుంది - ప్రభుత్వ భాగస్వామ్యం ఉండటం వల్ల మెట్రో సేవలపై విశ్వాసం పెరుగుతుంది.

భవిష్యత్లో పరిష్కార మార్గాలు. హైదరాబాద్ మెట్రో దీర్ఘకాలంలో.. విజయవంతం కావాలంటే కొన్ని చర్యలు అవసరం. ప్రయాణికుల సంఖ్య పెంచడం - బస్సులు, మెట్రో, MMTS మధ్య ఇంటిగ్రేషన్ బలోపేతం చేయాలి. రాజకీయ మద్దతు - కేంద్రం, రాష్ట్రం కలిసి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలి. ఆదాయ వనరుల విస్తరణ - టికెట్ ధరల కంటే, ప్రకటనలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, కమర్షియల్ స్పేస్ల ద్వారా ఆదాయం పెంచాలి. సాంకేతికత వినియోగం - స్మార్ట్ కార్డ్, మొబైల్ యాప్లు, డిజిటల్ టికెట్టింగ్ ద్వారా సౌకర్యాన్ని పెంచాలి. హైదరాబాద్ మెట్రో నగరానికి ప్రాణాధారం వంటిది. కానీ దాని నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించకపోతే, భవిష్యత్లో ఇది పెద్ద సమస్యగా మారే అవకాశం ఉంది. L&T లేఖ ద్వారా వచ్చిన సంకేతం స్పష్టమే - ఒక ప్రైవేట్ కంపెనీకి మాత్రమే ఇది భారం అవుతోంది. కాబట్టి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఏర్పాటు చేస్తే, మెట్రో ప్రాజెక్టు మరింత స్థిరత్వం పొందుతుంది.




## ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా నిర్మించుకోవాలి

**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 20:**

ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా నిర్మించుకోవాలని ఎంపీడీవో లెంకల గీతారెడ్డి అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను దసరా లోపు పూర్తి చేసుకోవాలని అన్నారు. అనంతరం పిఎంఏవై జి సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఒగ్గు మధు, పాఠశాల ఉపాధ్యాయుడు వేణుగోపాల్ రావు, కారోబార్ పలుగుల ప్రశాంతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 20:**

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తుర్కపల్లి మండలం చిన్న లక్ష్మాపురం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన దుబ్బాల శ్రీకాంత్ రెడ్డి( 42 )తన వ్యవసాయ బావి వద్ద చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సై తక్యుద్దీన్ కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం బాడీని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సింది ఉందని అన్నారు.

## పనిగంటల పెంపు పద్ధతిని వెంటనే ఉపసంహరించుకోవాలని

- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**



రాష్ట్ర శాసనసభలో సవరించిన 13 గంటల పని విధానం రద్దు చేయాలని పని గంటల విధానంలో ప్రభుత్వం ఎనిమిది గంటల నుండి 13 గంటలు పెంచుతూ రాత్రి సమయంలో మహిళలతో పని చేయించేందుకు శుక్రవారం రాష్ట్ర శాసనసభలో కార్మిక చట్టాలను సవరణ చేశారు పని గంటల పెంపు పద్ధతిని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. దీనిపై శనివారం ఫార్మసిటీలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కార్మికుల సంక్షేమమే మా ధ్యేయమని అధికారంలోకి వచ్చి నేడు స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడుదారులకు కార్మికుల శ్రమను దోచుకునేందుకు మరింత అనుకూలంగా కార్మిక చట్టాలను మారుస్తుంది ఫ్యాక్టరీలు చట్టం 1948 సవరణ చేసి సభ ఆమోదం తెలిపింది కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం చట్టాలను నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలోకి తొక్కి కార్మికులను మరింత దోపిడీ చేసే విధంగా చట్టాలను సవరించడం దుర్మార్గమని వెంటనే 13గంటల పని విధానం పెంపు, మహిళలకు రాత్రి డ్యూటీలు రద్దు చేయాలని లేదంటే కార్మికులను పెద్ద ఎత్తున సమీకరించి ప్రజా పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. 1926లో ట్రేడ్ యూనియన్ చట్టం ఏర్పడిందని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించాలని, కార్మిక హక్కులను హరించాలని ప్రయత్నాలు చేయడం రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి కార్మిక వర్గం తీవ్రమైన గుణపాఠం చెప్తారని గని శెట్టి హెచ్చరించారు. బ్రిటిష్ పాలకుల కంటే ఘోరంగా కార్మికులకు ఉన్న హక్కులను యాజమాన్యాలకు తాకట్టు పెట్టాలనే ప్రయత్నాలను ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు అవగాహన సమావేశం

**జయభేరి, పరవాడ:**



అనకాపల్లి జిల్లా పరిధి పరవాడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో, పెదముషిడివాడ జడ్.పీ.హెచ్. పాఠశాలలో విద్యార్థులతో పరవాడ పోలీస్ శాఖ ప్రత్యేక అవగాహన సమావేశం ననిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలు మరియు చట్టపరమైన పరిణామాలు,బాలికల భద్రత మరియు స్వీయ రక్షణ చిట్కాలు,ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేసారు.మహిళా భద్రత కోసం రూపొందించిన సక్తి యాప్ ఉపయోగ విధానం,చిన్నారుల చేత వాహనాల నడపడం (జువెనైల్ డ్రైవింగ్) వల్ల కలిగే ప్రమాదాలు మరియు చట్టపరమైన చర్యలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణ , ఉపాధ్యాయులు మరియు సిబ్బంది సక్రియంగా పాల్గొని, విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. మల్లికార్జున రావు మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, చట్టాన్ని గౌరవించాలని ప్రతి విద్యార్థిని గురించి అవగాహన కలిగి ఉండాలి. సక్తి యాప్ ప్రతి బాలిక తప్పనిసరిగా వాడాలని చిన్నారుల చేత వాహనాల నడపడం చాలా ప్రమాదకరం అని అందరూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి అని సూచించారు.



## పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 20:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని మాజీ సర్పంచ్ సోక్కుల మోహన్ రెడ్డి అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలోని ఎంపియుపిఎస్ పాఠశాలలో పనిచేయుచున్న బి. హారతి మండల ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికైన సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోక్కుల మోహన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ముఖ్య ఉద్దేశంతో పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత ఉన్నందున తన సొంత నిధులతో వాలెంటైర్ టీచర్ అల్వాల ప్రవల్లికను నియమించినట్లు తెలిపారు. ఆమెకు మూడు నెలల జీతం 24 వేల రూపాయలను అందజేసినట్టు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యాబోధనను నేర్పించి ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఏ పీసీ చైర్మన్ మంజుల, మాజీ ఎంపీటీసీ గుంటి రమేష్, మాజీ ఎస్ఎంసి చైర్మన్ దండ బోయిన పోచమల్లు, మాజీ వార్డ్ మెంబర్ గురు శ్రీశైలం, రాజశేఖర్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో అండర్ 17 బేస్ బాల్ ఎంపికలు



**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి డి.ఈ.ఓ జి.అప్పారావు నాయుడు ఆదేశాలు మేరకు విశాఖ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో అండర్ 17 బాలురు బేస్ బాల్ ఎంపికలు సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు,పరవాడ గర్ల్ స్కూల్ నందు జరిగాయి. ఈ ఎంపికలు సుమారుగా 160 మంది పాల్గొనగ ఇందులో ఎంపిక అయినా క్రీడాకారులు అండర్ 17 విశాఖ ఉమ్మడి జిల్లా జట్టుగా రాష్ట్రస్థాయి లో పోటీలలో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ సెక్రటరీ కె. ఎమ్ నాయుడు తెలిపారు.ఈ పోటీలను సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి ప్రారంభించగా ఎం. వి నాగేశ్వరావు అబ్సర్వర్ గా వ్యవహరించారు మరియు సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు అండర్ 17 బాయ్స్ పోటీలు నిర్వహించుటకు అవకాశం కల్పించిన యాజమాన్యంకు, కోచ్ రాజేష్ కు సెక్రటరీ కె. ఎమ్. నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రి పొన్నంకు ఆహ్వాన పత్రిక అందజేత



**జయభేరి, వర్గల్, సెప్టెంబర్ 20 :**

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యా సరస్వతి శరన్నవరాత్ర మహోత్సవాలు ఈ నెల 22 వ తేదీన ప్రారంభం కానుండగా, శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కాగా ఈ నెల 29వ తేదీ మూల నక్షత్ర విశేష పూజలో పాల్గొననున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో చిన్నారుల బతుకమ్మ సంబరాలు



**జయభేరి, దేవరకొండ :**

స్థానిక దేవరకొండ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు మోడల్ బతుకమ్మ సంబరాలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో రంగురంగుల పూలను పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ ఒక లయతో కోలాటపు అడుగులు వేస్తూ బతుకమ్మ పాటలను పాడుతూ ఎంతో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు ఎంతో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ అనేది తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమే కాక మహిళల ఆత్మగౌరానికి ప్రతీక అని గౌరమ్మను పూజించడం ఎంతో శ్రేయస్కరమని విద్యార్థులకు బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ అన్వర్ హుస్సేన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేసినారు.



## ఆదిలోనే క్యాన్సర్ ను అరికట్టవచ్చు

**జయభేరి, పరవాడ:**

స్వశక్తి నారి సశక్త్ పరివార్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా పరవాడ గ్రామములో పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో క్యాన్సర్ పై అవగహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్.జయశ్రీ కరిష్మా మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే ఆదిలోనే అరికట్టవచ్చని మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, గర్భశయ క్యాన్సర్ నోటి క్యాన్సర్, మొదలగున వాటిని ఎలా తెలుసుకోవాలో అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీ ఏ ఏ పోషకాహారాలు తినలో, రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. వివిధ వ్యాధులతో వచ్చిన వారికి పరీక్షలు చేయడం జరిగింది. డా. శిరీష ఆధ్వర్యంలో ఆయుష్ క్లినిక్ జరిగింది.అంగనవాడి కార్యకర్తలు పోషకాహార్ స్టాల్ ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కలిగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం. ఎస్.ఎస్.సాయిరాం పి హెచ్ఎన్ జానకి రామన్, సూపర్వైజరీస్ ఎమ్మెస్ ప్రసాదు, హెచ్ వి.పి.వి రత్నం. ఎం.ఎల్.హెచ్.పిస్, ఆరోగ్య సిబ్బంది, అంగనవాడి కార్యకర్తలు ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (A), ఉమెన్స్ ఎంపవర్మెంట్ సెల్ (WEC) విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాన్నీ ఎంతో ఘనంగా నిర్వహించారు విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పువ్వులతో బతుకమ్మను అలంకరించి ఆడి పాడారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలలో బతుకమ్మ ఎంతో ఘనమైన ఉత్సవమని దాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత తెలంగాణ ప్రజలందరి పైన ఉందని విద్యార్థులు స్వతహాగా బతుకమ్మను తయారుచేసి తీసుకొని రావడం ఆడి పాడడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి కోటయ్య అకాడమిక్ కోఆర్డినేటర్ సి లింగమయ్య COE జి లింగారెడ్డి,IQAC కోఆర్డినేటర్ డాక్టర్ కె.పృథు,WEC సెల్ కోఆర్డినేటర్ ఎస్ కే ఆరిఫా, డాక్టర్ కె.రేణుక తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## ABVP ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**జయభేరి, దేవరకొండ :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏబీవీపీ నల్గొండ విభాగ్ హాస్టల్ కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ ప్రధానంగా మహిళలకు ప్రాముఖ్యత బతుకమ్మ పండుగ ఉంటుంది, మన దేశ సంస్కృతి లో గోవుని గోమాత, భూమిని భూమాత, అన్నంని అన్నపూర్ణ దేవి మాత, చదువును చదువుల తల్లి సరస్వతిగా పైసలను లక్ష్మీదేవిగా కొలుచుకుంటాం అనీ అన్నారు. దేవుడికి పూజ చేయడానికి పూలు ఉపయోగిస్తారు కానీ మన తెలంగాణ రాష్ట్రంలో పువ్వులను సైతం పూజిస్తూ ప్రత్యేక పండుగ మనము రంగురంగులు పువ్వులు పేర్చి వేరువేరు పేర్లతో గౌరమ్మని కొలువు తీర్చి తొమ్మిది రోజులపాటు ఘనంగా జరుపుకుటామని అన్నారు. ఈ కార్యక్రమం లో మోడల్ కళాశాల కార్యదర్శి బీ.వినయ్, విక్రమ్, ఐతరాజు కొండల్, భూషరాజు రాకేష్, మణి,శివ, మౌనిక,శిల్ప శిరీషష్, శ్రావణి , నందిని తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 20:**

తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామ పరిధిలోని విశ్వభారత్ గ్లోబల్ స్కూల్లో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆటలను ఆడారు. పాఠశాల డైరెక్టర్ ప్రతిమ మాట్లాడుతూ తెలంగాణలో మహిళలకు తెలంగాణలో ముఖ్యమైన పండుగ బతకమ్మ పండుగ అని అట్టి పండుగను విద్యార్థులు బతుకమ్మలను పేర్చి పాఠశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. మనమందరం సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలని ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, రామలీల, రాజేశ్వరి, శైలజ, శిరీష, కల్పన, స్వీటీ రెడ్డి, నవనీత, కవిత విద్యార్థినిలు పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగ.. 9 రోజులు 9 రూపాలు..

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

**తెలంగాణ ప్రజలకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ సంబరాలు త్వరలో మొదలుకానున్నాయి. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. 9 రోజుల పాటు అంగ రంగ వైభవంగా జరుపుకునే పెద్ద పండుగ బతుకమ్మ. మనిషి జీవితం ప్రకృతితో విడదీయరాని అనుబంధం పెనవేసుకుని ఉంటుందని తెలియజెప్పే పండుగ బతుకమ్మ. ఈ నేపథ్యంలో 9 రూపాల బతుకమ్మ విశిష్టతను తెలుసుకుందాం..**




### బతుకమ్మ పండుగ 2025

పూలను పూజించే విశిష్టమైన పండుగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. ఆడబిడ్డలందరూ అత్తవారింటి నుంచి పుట్టింటికి చేరి తీరొక్క పూలను సేకరించి ఆనందంగా అంగరంగ వైభవంగా బతుకమ్మ పండగను జరుపుకుంటారు. ప్రతి ఏడాది ఈ బతుకమ్మ పండుగ మహాలయ అమావాస్య రోజు నుంచి ప్రారంభమై.. 9 రోజుల పాటు ఘనంగా జరుపుకుంటారు. ఈక్రమంలో ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 21 నుంచి 30వ తేదీ వరకు జరపుకోనున్నారు. ఈ 9 రోజులు ఆడపడుచులు రోజూ ఓ రూపంలో బతుకమ్మను ఆరాధిస్తారు. ఈ క్రమంలో 9 రోజుల విశిష్టత గురించి తెలుసుకుందాం..

### 1వ రోజు ఎంగిలి పూల బతుకమ్మ

బతుకమ్మ పండుగ వేడుకలు తొలి రోజు మహాలయ అమావాస్య రోజు నుంచి మొదలవుతుంది. తెలంగాణలో దీనినే పెత్రామస అని కూడా అంటారు. ఈరోజున బతుకమ్మను పేర్చడానికి వినియోగించే పూలను ముందు రోజే తెంపుకొచ్చి వాడిపోకుండా నీళ్లలో వేసి మరుసటి రోజు బతుకమ్మగా పేరుస్తారు. అందుకే ఎంగిలిపువ్వు అంటారని చెబుతారు. అలాగే.. భక్తులు మొదటి రోజు తమ పూర్వీకులకు అన్నదానం చేసి ఆ తర్వాత బతుకమ్మను పేరుస్తారు కాబట్టి ఎంగిలి పువ్వుల బతుకమ్మ అని అంటారని కూడా కొందరు చెబుతారు. ఆరోజున వాయనంగా తమలపాకులు, తులసి ఆకులు ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ ఎంగిలి పూల బతుకమ్మ రోజు బియ్యంతో కలిపి నువ్వులు, బియ్యం పిండి నైవేద్యంగా బతుకమ్మకు నివేదిస్తారు.





### 2వ రోజు అటుకుల బతుకమ్మ

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజు ఈ అటుకుల బతుకమ్మ వేడుక జరుగుతుంది. తంగేడు పూలు, గునుగు పూలు, బంతిపూలు, చామంతి, అడవి గడ్డి పూలతో రెండు ఎత్తుల్లో బతుకమ్మను పేరుస్తారు. ఈ అటుకుల బతుకమ్మ పండుగ రోజు సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు వంటివి బతుకమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.

### 3వ రోజు ముద్దపప్పు బతుకమ్మ

ఆశ్వయుజ మాసం మూడో రోజు ఈ వేడుక జరుగుతుంది. ఈ రోజున బతుకమ్మను మూడంతరాల్లో చామంతి పూలు, మందార పూలు, సీతమ్మ జడ, రామబాణం పూలు పేర్చి తామర పాత్రల్లో బతుకమ్మను అందంగా అలంకరిస్తారు. శిఖరంపైన గౌరమ్మను ఉంచి ఉదయం పూజలు చేసి సాయంత్రం గుడి దగ్గర లేదా 4 రోడ్ల కూడలిలో ఆడవారందరూ కలిసి ఆడుకొని చెరువులో వేసి వస్తారు. ఈ ముద్దపప్పు బతుకమ్మ రోజున ముద్దపప్పు, పాలు, బెల్లంతో కలిపి బతుకమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.





### 4వ రోజు- నాన బియ్యం బతుకమ్మ

ఆశ్వయుజ మాసంలోని 4వ రోజు బతుకమ్మను పేరుస్తారు. ఈరోజు తంగేడు పూలు, గునుగు పూలతో నాలుగంతరాలుగా బతుకమ్మను పేర్చి శిఖరం పైన గౌరమ్మను పెడతారు. ఈరోజున నాన బెట్టిన బియ్యం, పాలు, బెల్లం కలిపి బతుకమ్మకు నైవేద్యంగా నివేదిస్తారు.

### 5వ రోజు అట్ల బతుకమ్మ

అశ్వయుజ మాసంలో 5వ రోజు అట్ల బతుకమ్మను చేస్తారు. తంగేడు పూలు, గునుగు పూలు, చామంతి పూలు, మందార పూలు, గుమ్మడి పూలను అయిదంతరాలుగా పేర్చి ఈ బతుకమ్మను తయారు చేస్తారు. ఈ బతుకమ్మకు గోధుమ అట్లు లేదా బియ్యం పిండెతో చేసిన దోశలు నైవేద్యంగా సమర్పిస్తారు.

### 6వ రోజు అలిగిన బతుకమ్మ

బతుకమ్మ పండుగలో ఆరో రోజైన ఆశ్వయుజ పంచమి నాడు బతుకమ్మను అలిగిన బతుకమ్మగా ఆరాధిస్తారు. అంటే ఈరోజు బతుకమ్మ అలకవోతుంది. ఈరోజున గౌరీ దేవి బాధపడ్డారని భక్తులు నమ్ముతారు. ఈ రోజున అమ్మవారు అలిగి ఏమి తినరని అంటారు. అందుకే నైవేద్యం ఏమీ సమర్పించరు.

### 7వ రోజు వేపకాయల బతుకమ్మ

ఇది ఆశ్వయుజ మాసంలో 7వ రోజు. ఈ రోజున వేపకాయల బతుకమ్మను పేరుస్తారు. ఈ బతుకమ్మను తంగేడు పూలు, గునుగు పూలు, చామంతి పూలు, గులాబి పూలతో ఏడంతారాలుగా పేర్చి ఆడుకొని చెరువులో వేస్తారు. ఈ రోజున బతుకమ్మకు బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్ల ఆకారంలో తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

### 8వ రోజు వెన్నముద్దల బతుకమ్మ

ఆశ్వయుజ మాసంలో 8వ రోజున తంగేడు పూలు, గునుగు పూలు, చామంతి పూలు, గులాబీ పూలు, గడ్డి పూలు, మొదలైన పువ్వులతో బతుకమ్మను పేరుస్తారు. ఈ బతుకమ్మకు నువ్వులు, వెన్న, నెయ్యి బెల్లం కలిపి నైవేద్యంగా తయారు చేసి బతుకమ్మకు నివేదిస్తారు.

### 9వ రోజు సద్దుల బతుకమ్మ

బతుకమ్మ పండుగలో చివరిరోజు. ఈ రోజున పెద్ద బతుకమ్మ పక్కన.. చిన్న గౌరమ్మను కూడా తయారు చేసి జాగ్రత్తగా ఎత్తుకొని బతుకమ్మను, గౌరమ్మను పూజించి ఆడవారు చెంపలకు రాసుకుంటారు. ఇది చివరి రోజు కాబట్టి ఆడపిల్లలు అందరూ కలసి చీకటి పడే వరకు బతుకమ్మ ఆడతారు. ఇది ఆశ్వయుజ మాసంలో అష్టమి రోజు అలాగే దుర్గాష్టమి మహా పర్వదినం నాడు వస్తుంది. ఈ రోజున బతుకమ్మకు 5 రకాల నైవేద్యాలు నివేదిస్తారు. వీటిలో పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ పులిహోర, కొబ్బరి అన్నం, నువ్వుల సద్ది వంటివి ఐదు రకాల నైవేద్యాలను బతుకమ్మ అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

# యువత స్వయం ఉపాధితో ముందుకు వెళ్లాలి

- బిఆర్ఎస్ నాయకుడు రవీందర్ యాదవ్
- తిరుమల డిజిటల్స్ ను ప్రారంభించిన వై. రవీందర్ యాదవ్
- హాజరైన జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, బీఆర్ఎస్ నాయకులు

**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 20 :**



యువత స్వయం ఉపాధితో రాణించి ఆర్థికంగా ఎదగాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని జడ్చర్ల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన తిరుమల డిజిటల్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ; ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువత సమాజంలో తమ సొంత కాళ్లపై నిలబడే విధంగా రాణించాలని అన్నారు. యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ కౌన్సిలర్లు యుగంధర్, కానుగు అనంతయ్య, నంద కిషోర్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, నాయకులు నక్కల వెంకటేష్, వీరేశం గుప్తా, ఒగ్గు కిషోర్, చందు నాయక్, తదితరులు పాల్గొన్నారు..

## ఓ వ్యక్తి, ఇద్దరు మహిళలు..

- ఇంట్లోనే దుకాణం పెట్టేశారుగా..

**జయభేరి, మహబూబ్ నగర్ , సెప్టెంబర్ 20:**


ఓ వ్యక్తి, ఇద్దరు మహిళలు.. జల్సాలకు బాగా అలవాటు పడ్డారు. ఈజీ మనీ కోసం ఆరాటపడ్డారు. కట్ చేస్తే.. ఇంట్లోనే దుకాణం పెట్టేశారు. బాధితుడిని ట్రాప్ చేసి రూ. 3 కోట్ల వరకు లాక్కున్నారు. ఆ తర్వాత జరిగిందిదే.. ఈ ఘటన కర్నూలులో చోటు చేసుకుంది. ఆన్ లైన్‌లో న్యూడ్ వీడియోలతో పరిచయం చేసుకుని బెదిరింపులకు పాల్పడిన ముగ్గురు ముఠా సభ్యులను కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణలోని నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తికి చెందిన భార్య భర్త మల్లేష్, మేరీ.. మల్లేష్ ప్రియురాలు మల్లిక అక్రమంగా డబ్బులు సంపాదించాలని కుట్ర పన్ని ట్విట్టర్‌లో సంయుక్త రెడ్డి అని ఓ ఐడీ ఓపెన్ చేసి న్యూడ్ వీడియో కాల్స్ చేస్తూ ప్రజలను మోసం చేశారని కర్నూలు సీఐ నాగరాజరావు తెలిపారు.ఈ క్రమంలో కర్నూలుకు చెందిన శ్రావణ్ అనే వ్యక్తిని ట్విట్టర్ వేదికగా పరిచయం చేసుకుని విలువైన పొలాలు తక్కువ ధరకు అమ్ముతామని చెప్పి 3 కోట్ల 80 లక్షల రూపాయలు అకౌంట్‌లో వేయించుకున్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కర్నూలు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ముఠా సభ్యులను అరెస్టు చేశారు. వారి నుంచి 41 లక్షల రూపాయలు విలువ చేసే కార్లు, ద్విచక్ర వాహనం, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన 3 కోట్ల 38 లక్షల రూపాయలు జల్సాలకు ముగ్గురు ముఠా సభ్యులు వాడుకున్నారని సీఐ తెలిపారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు




# సహజత్వానికి ప్రాముఖ్యతనిచ్చే నటుడు మోహన్‌లాల్..

ప్రముఖ మలయాళ నటుడు, భారతీయ సినీ పరిశ్రమకు అమూల్యమైన సేవలు అందించిన మోహన్‌లాల్‌కు భారత ప్రభుత్వం అత్యున్నత సినీ గౌరవం అయిన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించింది. 2023 సంవత్సరానికి గానూ ఆయనకు ఈ పురస్కారం దక్కడం సినీ ఇండస్ట్రీలో ఆనందోత్సాహాలను నింపింది. కేంద్ర సమాచార, ప్రసారశాఖ ఈ నిర్ణయాన్ని సెప్టెంబర్ 20న అధికారికంగా ప్రకటించింది.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న సినీ, రాజకీయ ప్రముఖులు మోహన్‌లాల్‌కు అభినందనలు తెలుపుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా మోహన్‌లాల్‌కు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. “ప్రముఖ నటుడు మోహన్‌లాల్ ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపిక కావడం ఎంతో సంతోషకరం. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. అభినయంలో సహజత్వానికి ప్రాధాన్యత ఇచ్చే మోహన్‌లాల్ ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించారు. ఐదు జాతీయ పురస్కారాలు అందుకున్న ఆయన, తెలుగులో కూడా ‘ఇద్దరు’, ‘కంపెనీ’, ‘జనతా గ్యారేజ్’ వంటి సినిమాలతో మనల్ని అలరించారు. భవిష్యత్తులో మరిన్ని వినూత్న పాత్రల్లో ఆయనను చూడాలన్న ఆకాంక్ష ఉంది,” అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.మోహన్‌లాల్‌కు ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ, సహనటుడు మమ్ముట్టి, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. భారత సినిమా రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలకు ఇది గొప్ప గౌరవం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. 1978లో సినీ రంగంలోకి అడుగుపెట్టిన మోహన్‌లాల్, నాలుగు దశాబ్దాలకు పైగా తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తూ వస్తున్నారు. మలయాళ సినిమాలకు మాత్రమే కాకుండా తమిళ, హిందీ, తెలుగు భాషల్లోనూ తన ముద్ర వేశారు. ఆయనకు పద్మశ్రీ (2001), పద్మభూషణ్ (2019) వంటి ప్రస్థాన గౌరవాలు కూడా లభించాయి. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ద్వారా మోహన్‌లాల్ సినీ జీవితం మరింత వెలుగొందనుంది. మోహన్‌లాల్ అసలు పేరు మోహన్‌లాల్ విశ్వనాథన్ నాయర్. 1960 మే 21న కేరళలోని పతనంతిట్టలో ఆయన జన్మించారు

# శివ మళ్లీ వస్తున్నాడు




తెలుగు సినిమా దిశను సమూలంగా మార్చిన సినిమా ‘శివ’. తెలుగు సినిమా అంటే ‘శివ’కు ముందు ‘శివ’ తర్వాత.. అని నిస్సంకోచంగా చెప్పొచ్చు. 1989లో విడుదలైన ఈ సినిమా సృష్టించిన చరిత్ర అలాంటిది. దర్శకునిగా రామ్‌గోపాల్‌వర్మ తొలి సినిమా ఇది. తొలి సినిమాతోనే డైరెక్షన్‌కి కొత్త నిర్వచనం చెప్పారు వర్మ. కథానాయకుడిగా అక్కినేని నాగార్జునకు దశాబ్దాలపాటు గుర్తుండిపోయే విజయాన్ని ఇచ్చారు. ప్రస్తుతం రీరిలీజుల ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో ‘శివ’ మళ్లీ విడుదల కానుంది. మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 14న మరోసారి బిగ్ స్క్రీన్‌పైకి ఈ సినిమాను తీసుకురానున్నారు. అత్యాధునిక ఏఐ టెక్నాలజీతో రీ మాస్టర్ చేసి, అడ్వాన్స్ 4K డాల్బీ అట్మాస్‌లోకి మార్చి ‘శివ’ను విడుదల చేస్తున్నామని, కథలను ఎప్పటికీ సజీవంగా ఉంచడమే నాన్నగారికి సరైన నివాళి అని అక్కినేని నాగార్జున చెప్పారు.



# టాలీవుడ్ నా రెండో పుట్టిల్లు..

‘అశోకవనంలో అర్జున కల్యాణం’ సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైన ఉత్తరాది భామ రితికా నాయక్. మొదటి సినిమాకే విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ బ్యూటీ ఆచితూచి అడుగులు వేస్తూ కథలను ఎంచుకుంటున్నది. ‘హాయ్ నాన్న’లో నాని కూతురుగా మెరిసిన రితిక తాజాగా ‘మిరాయ్’ సినిమాలో మరోసారి తన నటనతో అందరినీ ఆకట్టుకుంది.
మాది ఒడియా కుటుంబం. మా కుటుంబం ఒడిశా నుంచి ఢిల్లీకి వెళ్లి స్థిరపడింది. నేను పుట్టింది, పెరిగింది అక్కడే. జీవితంలో ప్రతి విషయంలోనూ నా తల్లిదండ్రులు అండగా ఉన్నారు. సినీ ఇండస్ట్రీలో ఉన్నప్పటికీ వ్యక్తిగత విషయాలను ఎక్కువగా పంచుకోవడం ఇష్టం ఉండదు. డ్యాన్స్, ట్రావెలింగ్ అంటే ఇష్టం.
డిగ్రీ చదువుతున్నప్పుడే మోడలింగ్, యాక్టింగ్‌పై ఆసక్తి కలిగింది. స్నేహితుల ప్రోత్సాహంతో ఫ్రెష్ ఫేస్ పోటీల్లో పాల్గొన్నాను. 2019లో ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ సీజన్ 12లో విన్నర్‌గా నిలిచాను. అది నా కెరీర్‌కు మొదటి మెట్టు. ఆ పోటీ నాకు కాన్ఫిడెన్స్ ఇచ్చింది. అక్కడ నుంచి మోడలింగ్‌తోపాటు సినిమాల్లోనూ అవకాశాలు వచ్చాయి. ‘మిరాయ్’ థ్రిల్లర్ మూవీ. చాలా డైనమిక్ పాత్ర కావడంతో కథ వినగానే వైబ్రెంట్‌గా ఫీలయ్యాను. తేజ చాలా డెడికేషన్ ఉన్న యాక్టర్. స్క్రీన్‌పై మా కెమిస్ట్రీ బాగా కుదిరింది.



# ప్రియాంక స్థానానికే ఎసరు..

పాన్ ఇండియా బ్యూటీ రష్మిక మందన్న క్రేజ్ అమాంతం పెరిగిపోతోంది. దక్షిణాదితో పాటు బాలీవుడ్ లోనూ ఈ అమ్మడికి వరుసగా అవకాశాలు దక్కుతున్నాయి. తాజాగా ఈ నేషనల్ క్రష్ ప్రియాంక చోప్రా స్థానానికే ఎసరు పెట్టిందని బాలీవుడ్ లో రూమర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇది ఆశ్చర్యంగా అనిపించవచ్చు కానీ ఇది నిజం. ఇప్పటివరకు ‘క్రిష్’ సిరీస్ లో తెరకెక్కిన సినిమాల్లో గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రానే హీరోయిన్ గా నటించింది. అయితే ఇప్పుడు ‘క్రిష్ 4’ చిత్రంలో ప్రియాంక స్థానాన్ని రష్మిక భర్తీ చేయనుందని సమాచారం. ‘క్రిష్ 4’ సినిమాలో హృతిక్ రోషన్ హీరో. అంతేకాదు దర్శకత్వం కూడా తన వహిస్తున్నాడు. ఇక రష్మిక మందన్న విషయానికి వస్తే.. ఇప్పటి వరకు అతనితో కలిసి నటించలేదు. దీంతో ఈ కొత్త జంటను చూడటానికి అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రష్మిక మందన్న ‘పుష్ప,’ ‘పుష్ప 2’, ‘యానిమల్’, ‘ఛావ’ సినిమాలతో స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. సల్మాన్ ఖాన్ తో కలిసి నటించిన సికిందర్ పరాజయాం పాలైనా ఈ నేషనల్ క్రష్ క్రేజ్ కొంచెం కూడా తగ్గలేదు. ఇప్పుడీ ముద్దుగుమ్మ చేతిలో స్టార్ హీరోల సినిమాలతో పాటు లేడీ ఓరియంటెడ్ మూవీస్ ఉన్నాయి. ఇప్పుడు ‘క్రిష్ 4’ ఆఫర్ కూడా రష్మికకు వచ్చిందని టాక్. అయితే చిత్ర బృందం దీని గురించి ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. రష్మిక ప్రస్తుతం ‘థామ’ అనే హిందీ సినిమాలో నటిస్తోంది. దీనితో పాటు ‘కాక్టెయిల్ 2’ సినిమాలో కూడా యాక్ట్ చేస్తోంది. వీటితో పాటు ‘ది గర్ల్ ఫ్రెండ్’ లాంటి లేడీ ఓరియంటెడ్ మూవీలోనూ లీడ్ రోల్ పోషిస్తోంది. ఇప్పుడు హృతిక్ సినిమాలో హీరోయిన్ గా ఛాన్స్ వస్తే రష్మిక కెరీర్ నెక్స్ట్ లెవెల్ కు చేరుకున్నట్లేనని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బిగ్‌బాస్ వైల్డ్ కార్డ్ ఎంట్రీలకు ముహూర్తం ఫిక్స్! హౌస్‌లోకి ఆ కాంట్రవర్సీ క్వీన్స్

బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9 రసవత్తరంగా సాగుతోంది. సెప్టెంబర్ 7న ప్రారంభమైన ఈ రియాలిటీ షో రెండో వారం ముగింపు దశకు చేరుకొన్నది. మొత్తం 15 మంది కంటెస్టెంట్స్ హౌస్ లోకి ఎంట్రీ ఇచ్చారు. సెలబ్రిటీల క్యాటగిరీలో భరణి శంకర్, ఇమ్మాన్యుయేల్, రీతూ చౌదరీ, సంజనా గల్రానీ, తనూజా, శ్రష్టి వర్మ, ఆశా సైనీ, సుమన్ శెట్టి, రాము రాథోడ్ ఇంట్లోకి అడుగు పెట్టారు. ఇక కామన్ మ్యాన్ గ్రూప్ నుంచి శ్రీజ దమ్ము, డీమాన్ పవన్, పవన్ కల్యాణ్, హరిత హరీష్, మర్యాద మనీష్, ప్రియా శెట్టి తదితరులు షోలోకి వచ్చారు. వీరిలో తొలి వారం శ్రష్టి వర్మ ఎలిమినేట్ అయ్యారు. ఈ వారం కూడా మరొకరు హౌస్ నుంచి బయటకు రానున్నారు. రెండో వారంలో 7 గురు సభ్యులు నామినేషన్స్‌లో నిలిచారు. హరిత హరీష్, భరణి శంకర్, ఫ్లోరా సైనీ, మర్యాద మనీష్, ప్రియా శెట్టి, డీమాన్ పవన్ ఈ లిస్టులో ఉన్నారు. వీరిలో హౌస్ నుంచి ఎవరు బయటకు వెళ్లనున్నారో మరికొన్ని గంటల్లో తేలనుంది. ఈ క్రమంలో గత సీజన్ మాదిరిగానే ఈసీజన్ లోనూ వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఉండనున్నాయి. మొత్తం ఐదుగురు కంటెస్టెంట్లను హౌస్ లోకి పంపించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం రెండో కంటెస్టెంట్ ఎలిమినేట్ కావడానికి సిద్ధంగా ఉన్నాడు. 3వ వారంలో మరొకరు ఎలిమినేట్ అవ్వక తప్పదు. అయితే మూడో వారం లేదా నాలుగో వారంలో ఏదో ఒక వీక్ డబుల్ ఎలిమినేషన్ ఉండనుందని తెలుస్తోంది. అంటే మొత్తం ఐదుగురు కంటెస్టెంట్స్ బయటకు వెళ్లనున్నారన్నమాట. దీంతో రెండో దశలో మరో ఐదుగురిని హౌస్ లోకి తీసుకొచ్చే యోచనలో బిగ్ బాస్ నిర్వాహకులు ఉన్నట్లు సమాచారం. కాగా వైల్డ్ కార్డు ఎంట్రీ ద్వారా సెలబ్రిటీల నుంచి 4 గురు కంటెస్టెంట్లను, కామన్ మ్యాన్ కేటగిరిలో ఒకరిని బిగ్ బాస్ హౌస్ లోకి షోలోకి పంపేదుకు రెడీ అవుతున్నారని టాక్. సెలబ్రిటీల నుంచి అలేఖ్య చిట్టి పికిల్స్ ఫేమ్ రమ్య మోక్ష, సింగర్ శ్రీ తేజ, దివ్వెల మాధురి, జ్యోతి రాయ్‌ని ఎంపిక చేసినట్టు సమాచారం. వీరిలో జ్యోతిరాయ్, సింగర్ శ్రీ తేజ తప్పితే మిగతా ఇద్దరూ వివాదాలతో వార్తల్లో నిలిచిన వారే.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**